

కొత్తపాలెం సంతోష్‌నగర్ వద్ద మద్యం సీసాల పోగు (పాత చిత్రం)



చెరువు గట్టుపై తుప్పల్లో ఉన్న మద్యం సీసాలు



వెంకటాపురం యూజీడీ పంప్ హౌస్ వద్ద మందుబాబుల డెన్

బహిరంగంగా తాగేస్తున్నారు

- రహదారులు, తోటలు, ఖాళీస్థలాలే అడ్డా
- ఎక్కడికక్కడ డెన్‌ల ఏర్పాటు
- గుట్టలుగా లభ్యమవుతున్న సీసాలు
- పోలీసుల నిఘా కరువు
- మందుబాబుల ఆగడాలతో బిక్కుబిక్కుమంటున్న స్థానికులు

గోపాలపట్నం: మందుబాబులకు **అడ్డూ అదుపు** లేకుండా పోతోంది. గతంలో శివారు**ప్రాంతాల్లోని** చెరువులు, రైల్వే ట్రాక్‌లు, కల్వర్టులు, **తోటలకే పరి**మితం కాగా.. ఇప్పుడు నగరం నడి**మధ్యలో ఎక్కడ** ఖాళీ స్థలం కనిపించినా అడ్డాగా **మార్చేసుకుంటు**న్నారు. వందల్లో దొరుకుతున్న మద్యం సీసాలు తాగుబోతుల ఆగడాలకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. 89వ వార్డు కొత్తపాలెం ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

గుట్టలుగా మద్యం సీసాలు

ఇటీవల ఖజానా జ్యూయలరీ వెనుక మందుబాబులు పార్టీ చేసుకుని సీసాలను జాగ్రత్తగా దుకాణం కౌంటర్‌లో భద్రపరిచిన విషయం విదితమే. అలాగే, నాలుగు రోజుల క్రితం కొత్తపాలెం చెరువుగట్టు మీద గుట్టలుగా పడి ఉన్న మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, మంచినీటి సీసాలను జేడీ ఫౌండేషన్ సభ్యులు సేకరించారు. ఇక్కడ మొక్కలు నాటేందుకు వెళ్లిన వారు గుట్టలుగా పడి ఉన్న మద్యం సీసాలను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే వీటిని తొలగించే కార్యక్రమం చేపట్టగా.. కేవలం అరగంటలోనే జీవీఎంసీ పారిశుధ్య ఆటో నిండుగా ఉన్న సీసాలను సేకరించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆ ప్రాంతంలో ఇంకా చాలా బాటిల్స్ ఉన్నాయని, మరో నాలుగు రోజుల పాటు ఏరితే లారీ లోడ్ అయ్యేంతగా సీసాలు దొరుకుతాయని చెబుతున్నారు.



నరవ నుంచి వెంకటాపురం వెళ్లే దారిలో మందుబాబుల డెన్

మహిళల్లో ఆందోళన

మందుబాబులు ఖాళీ ప్రదేశాల్లో విచ్చలవిడిగా మద్యం సేవించడంతో, అటుగా రోడ్డువైపు వెళ్లాలంటేనే ఆందోళనగా ఉంటోందని స్థానిక మహిళలు వాపోతున్నారు. ఇటీవల కత్తులతో దాడులకు పాల్పడిన తర్వాత వారు మరింత భయపడుతున్నారు. ఇళ్లలోనే బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారని, ద్విచక్రవాహనాల్లో మద్యం సీసాలు పెట్టుకుని ఎక్కడికి కావాలంటే అక్కడికి అందిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

నిఘా వైఫల్యమే కారణం

మందుబాబులు బహిరంగంగా మద్యం సేవిస్తున్నా చర్యలు తీసుకునేవారే లేకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా ఉంటోంది. డ్రోన్లతో నిఘా పెట్టి పట్టుకుంటామని చెబుతున్న పోలీసులు చర్యలేవీ చేపట్టడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వీధుల్లో తిరగలేకపోతున్నామని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగుబోతుల వల్ల ఇబ్బంది పడుతున్నాం



తాగుబోతుల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయంలో వీధుల్లో తిరగాలంటేనే భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి బహిరంగ మద్యపానాన్ని నిరోధించాలి. మహిళలకు, వృద్ధులకు రక్షణ కల్పించాలి.

– కుప్పిలి నరసింహమూర్తి, విశ్రాంత ఉద్యోగి

పచ్చనితోటలు పాడవుతున్నాయి



తాగుబోతులు మద్యం సీసాలను విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. దీనివల్ల ఆ ప్రాంతమంతా చెత్తగా మారుతోంది. చెరువుగట్ల మీద పచ్చని తోటల్లో వ్యర్థాలను గుట్టలుగా పడేయడం వల్ల పర్యావరణం కూడా దెబ్బ తింటోంది. పోలీసులు స్పందించాలి. నిఘా పెట్టి, మందుబాబులపై చర్యలు తీసుకోవాలి.

– కారుమూరి రామకృష్ణ, కొత్తపాలెం

ఖాళీస్థలాలు, తోటలే డెన్‌లు

వెంకటాపురం శివారు ప్రాంతం (పెందుర్తి **పోలీస్ స్టేషన్ ప**రిధి శ్మశాన వాటిక ప్రాంతం), **వెంకటాపురం** నుంచి నరవ వెళ్లే రోడ్డులో తోటలు ఉన్న ప్రాంతం, కొత్తపాలెం చెరువులు, యల్లపువానిపాలెం రైల్వే మదుముల వద్ద నరవ వెళ్లే దారి.. ఇలా పలుప్రాంతాలను వీరు డెన్‌లుగా మార్చుకున్నారు. దీనికి తోడు బెల్టు దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో వీరి ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోందని పలువురు వాపోతున్నారు. కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లో బెల్టు దుకాణాలు ఎక్కువగా ఉన్నాయని, పైగా డోర్ డెలివరీ మొబైల్ దుకాణాలు కూడా నడుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అందులో కూటమి నాయకులు ఉన్నారని బహిరంగంగా చెబుతున్నారు.

క్లుప్తంగా

హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జూడోలో ప్రతిభ కనబరిచారు. గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో ఈ నెల 4న జరిగిన జిల్లా స్థాయి జూడో పోటీల్లో సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్–14లో 7వ తరగతి విద్యార్థి వికాస్ మూడు మ్యాచ్‌లో పోరాడి మొదటి స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్–17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న వి. యశ్వంత్, బాలికల విభాగంలో ఎస్.చాందిని, పి. హేమంత కుమారి జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పీఈటీ పుణ్యవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీ భవనం ఆధునికీకరణకు శ్రీకారం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద అంగన్‌వాడీ భవనం ఆధునికీకరణతో పాటు వంట గదినిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి హరి, పొలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు తువ్వాళ్ల పంపిణీ



నిరాశ్రయులకు తువ్వాళ్లు అందిస్తున్న మమత

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం నైట్ షెల్టర్‌లో నిరాశ్రయులకు మేనేజర్ ఎల్లేటి మమత తువ్వాళ్లు అందించారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలోఆమె మాట్లాడుతూ బుచ్చిరాజుపాలెం షెల్టర్‌లో 278 మందికి ఆశ్రయం కల్పించామని తెలిపారు. 22 మందికి ఉపాధి కల్పించినట్టు చెప్పారు. అలాగే 23 మందిని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడం చాలా సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. ఆధార్ క్యాంప్ ద్వారా ఒక గుర్తింపునిచ్చామని తెలిపారు.

ఉత్సాహంగా పీస్ పోస్టర్ కాంటెస్ట్



పోస్టర్లు వేసిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉక్కునగరం: లయన్స్ క్లబ్ స్టీల్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బాలబాలికలకు పీస్ పోస్ట్ కంటెస్ట్ నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ సేవా సంస్థ పిలుపు మేరకు ప్రతీ ఏటా స్కూల్ విద్యార్థులకు ప్రపంచశాంతిపై అవగాహన కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సెక్టార్–1 కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. లయన్స్ జిల్లా పీస్ పోస్టర్ కాంటెస్ట్ ప్రతినిధి ఎం.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ శాంతి అంటే విద్యార్థులకు అవగాహన కల్పించడానికే ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోటీల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, శాంతి భావన, కరుణా గుణం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యప్రకాశ్, జిల్లా చైర్ పర్సన్ ఈపూరి బుచ్చిరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

5న రాధాకృష్ణ మహోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న యాదవ సామాజిక వర్గ ప్రతినిధులు

మల్కాపురం: నగరంలోని ఆర్‌కేబీచ్ దరి గోకుల్ పార్కు వద్ద శ్రీకృష్ణుడి ఆలయంలో నవంబర్ 5న జరగనున్న రాధాకృష్ణ మహోత్సవాలను యాదవ సామాజిక వర్గం వారంతా విజయవంతం చేయాలని విశాఖ జిల్లా యాదవ్ సంక్షేమ సంఘం ప్రతినిధి అక్కరమాని వెంకటరావు పిలుపునిచ్చారు. మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఏటా ఆర్‌కే బీచ్ వద్ద ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రాధాకృష్ణ మహోత్సవాలకు నగరం నలుమూలల నుంచే కాకుండా శ్రీకాకుళం,విజయనగరం,అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా యాదవ సోదరులు తరలి వస్తారన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



విజేతలతో హెచ్‌ఎం రాజ్యలక్ష్మి

కంచరపాలెం: నేటి సమాజంలో బాలికలను సంరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని ఆర్పీపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రాజ్యలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు పరిధి రామూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం ' సేవ్ గర్ల్స్ చైల్డ్' పేరిట విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న ఆరాచకాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థినులు మంచి నడవడికతో మెలగాలని సూచించారు. అపరిచితుల నుంచి బహుమతులకు ఆశపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్‌ఎం రాజ్యలక్ష్మి హితవు పలికారు. చిత్రలేఖన పోటీల్లో ప్రథమ బహుమతి కె. మోనీషా, ద్వితీయ బహుమతి టి. పూజిత, తృతీయ బహుమతికి ఎస్.రాజేష్ ఎంపికయ్యారు. కన్సొలేషన్ బహుమతులకు సీహెచ్ జస్మిత, టి.సాయిమోహిత్, ఎం.తులసీనాయుడును ప్రోత్సాహక బహుమతులకు ఎంపిక చేశారు. సోమవారం విజేతలకు ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ ఎస్.జె.వి.ఎస్ శంకర్, క్రాఫ్ట్ టీచర్ సూరిశెట్టి రేణుకాదేవి, కంప్యూటర్ టీచర్ సీహెచ్ నాగపల్లవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరణించినా జీవిద్దాం

శరీర దానానికి 25 మంది అంగీకారం



అవయవ, శరీర దాన పత్రాలతో దాతలు, ఆయా సంస్థల ప్రతినిధులు

ఉక్కునగరం: మరణించిన తర్వాత తమ శరీర భాగాలు ఇతరులకు దానం చేయడం అంటే మరణించినా జీవించడమే అని పలువురు వక్తలు అన్నారు. స్పందన చేయూత ఫౌండేషన్, స్టీల్‌క్లబ్, మానవ వికాస వేదిక, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థ, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ సహకారంతో అఖిల భారత అవయవ మరియు శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీ భవన్‌లో ' అవయవ – శరీర దానం' పై అవగాహన సదస్సు నిర్వహించారు. అఖిల భారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ శరీర, అవయవ దానం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రాణదానం కలుగుతుందన్నారు. బ్రెయిన్ డెత్ అయిన తర్వాత అవయవ దానం ఇస్తే కలిగే ఉపయోగాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో 25 మంది శరీర దానం చేయడానికి ముందుకు వచ్చారు. అవయవ దానంలో భాగంగా ఐదుగురు కళ్ల దానం చేయడానికి అంగీకరించారు. సంస్థ కోశాధికారి జ్యోతి, విజయలక్ష్మి, సమన్వయకర్తలు ఎం.ఎ స్.ఎన్. మూర్తి, ఈపూరి బుచ్చిరాజు, సీ కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, వివిధ సంస్థల సభ్యులు పి. శ్రీనివాసరావు, గజేంద్రరావు, మాటూరి శ్రీనివాసరావు, ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అభిప్రాయ సేకరణ



వినతిపత్రం అందిస్తున్న దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: అమృత్ సంవాద్ కార్యక్రమం ద్వారా ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపర్చడంలో భాగంగా ప్రజా సంఘాలు, ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నామని తూర్పుకోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ ఆపరేషన్ విభాగం ప్రాంతీయ మేనేజర్ ప్రణవ్ జెట్లీ అన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఆయన సందర్శించి ప్రజా సంఘాలతో సమావేశమయ్యారు. అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై అభిప్రాయాలు స్వీకరించారు. నాలుగు రోజుల కిందట వాల్తేరు రైల్వే డీసీఎం పూజా సింగ్ సందర్శించి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు.

వినతులు ఇలా..

శ్రీకాకుళం నుంచి విశాఖ మీదుగా రాజమండ్రి, కాకినాడకు షటిల్ సర్వీస్‌లు నడపాలని, విశాఖ నుంచి బయల్దేరుతున్న రైళ్లకు రెండు నిమిషాల బదులు ఐదు నిమిషాల పాటు హాల్ట్ ఇవ్వాలని కోరారు.

- విశాఖపట్నం – సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందే భారత్‌కు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని, విశాఖ నుంచి షిర్డీ, కొల్లాం, గాంధీధామ్, వారణాసి రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని, విశాఖ తిరుపతి మీదుగా బెంగళూరు, చెన్నైకు రోజువారీ రైళ్లు నడపాలని, దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్సిల్ సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని విన్నవించారు.
- కొన్ని సందర్భాల్లో ఒకటి, నాలుగో నంబర్ ప్లాట్‌ఫారాలపై గూడ్స్ రైళ్లు నిలిపివేస్తున్నారని, దీని వల్ల అప్పటికప్పుడు ప్రయాణికులు పరుగులు తీయాల్సి వస్తుందని, ఈ రెండు ప్లాట్‌ఫారాలపై గూడ్స్ రైళ్ల రాకపోకలు నిరోధించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలోయూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి.జాషువ, కె.విజయ్‌కుమార్, సరోజినీ, మానవేంద్రనాథ్, రైల్వే అధికారులు రవి, కిరణ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పాలకుల నిర్లక్ష్యం

మల్కాపురం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పెన్షనర్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.నూకరాజు, హుస్సేన్ అన్నారు. కనీస పెన్షన్ అమలు చేయకుండా, ఇతర ప్రయోజనాలు సకాలంలో కల్పించకుండా ఇబ్బంది పెడుతున్నాయని వాపోయారు. 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం పారిశ్రామిక ప్రాంత పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఆ సంఘం ప్రతినిధి సీహెచ్ తమ్మారావు మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో కనీస పెన్షన్ 2500 అవుతున్నట్టు ప్రచారం జరుగుతోందని.. దీనిని ఎవరూ నమ్మవద్దు అని వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో మూడునెలలు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండి 40 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనంతో పాటు శిక్షణ సమయంలో అవసరమైన స్టేషనరీకి కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8309003957 నంబర్‌లో సంప్రదించాలని కోరారు../

కంటైనర్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ ఆవరణలో పార్కింగ్ చేసిన కంటైనర్‌ను రైల్వే పోలీసులు తొలగించారు. 'సాక్షి ' దినపత్రికలో ఈ కంటైనర్ ఎవరిదో అన్న శీర్షికన శుక్రవారం వచ్చిన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కంటైనర్‌ను తొలగించారు. సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు మెటీరియల్ తీసుకుని వచ్చిందని చెబుతున్నారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ లైన్ తవ్వే మిషన్ అందులో ఉందని తెలిపారు. స్టేషన్ వద్ద తవ్వకం పనులు పూర్తయ్యాయని మరో 2000 అడుగుల విస్తీర్ణంలో పనులు ఉన్నందున కంటైనర్‌ను ఇక్కడ ఉంచినట్టు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంటైనర్‌ను ఇక్కడి నుంచి తొలగించామని మరో చోట పెడుతున్నట్టు తెలిపారు.

నర్సుల సమస్యలు, సంక్షేమంపై చర్చ



ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను సత్కరిస్తున్న నర్సెస్ వింగ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న నర్సుల సమస్యలు, సంక్షేమంపై ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్‌తో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ వింగ్ ప్రతినిధులు జైతు రవీంద్రనాథ్, వి.ఉషారాణి, జి.శాంతమ్మ, వింగ్ చైర్‌పర్సన్ మంజులాదేవి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సిబ్బంది, సహాయక సిబ్బంది నియామకం, స్టాఫ్ నర్స్ అనే పదవి నామకరణాన్ని నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చడం, నర్సుల సంక్షేమం కోసం నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు, 55 ఏళ్లు పైబడిన నర్సులను కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు బదిలీ చేయకుండా మినహాయింపు తదితర అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నర్సెస్ వింగ్ ప్రతినిధులు తెలిపారు.

పలు చోట్ల భారీ అన్న సమారాధనలు



రెండు గుడుల సెంటర్ వద్ద అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సురేష్



శ్రీనివాస్‌నగర్‌లో అన్న సమారాధనలో పాల్గొన్న పెద్దిరెడ్ల నానాజీ

మల్కాపురం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 60వ వార్డు జవహర్‌నగర్ రెండు గుడుల సెంటర్ వద్ద టు టెంపుల్స్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ప్రారంభించారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అంగ రామ్‌ప్రసాద్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్ కుమార్, వ్యాపారవేత్త దున్న ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

- 58వ వార్డు పరిధి శ్రీనివాస్‌నగర్‌లో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో సామాజిక సేవా కార్యకర్త పెద్దిరెడ్ల నానాజీ పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు.

13 నుంచి ఐద్వా మహాసభలు



కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా నాయకురాలు విమల

మల్కాపురం: ఈ నెల 13,14,15వ తేదీల్లో అనంతపురంలో జరగనున్న అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ మహాసభల్లో మహిళలు పాల్గొని విజయవంత చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ ప్రతినిధి ఆర్.విమల పిలుపునిచ్చారు.ఐద్వా మహాసభల సందర్భంగా 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో శుక్రవారం ఆమె ఐద్వా పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ఐద్వా మహిళ రక్షణకు కవచంలా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు,హత్యలపై పోరాటాలు చేసి బాధితులకు అండగా నిలిచి దుండగులకు శిక్ష పడే విధంగా పోరాటాలు చేస్తుందని చెప్పారు.ఈ నెల 13,14,15 తేదీల్లో జరగనున్న మహాసభల్లో అంతా పాల్గొని ఐద్వా శక్తి చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజన 2.0 పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో టిడ్కో హౌసింగ్ కాలనీలో వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, మార్కెటింగ్ డైరెక్టర్ పి.జీవా ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 35 మంది రక్తదానం చేశారు. అనంతరం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–అర్బన్ 2.0 పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జెడ్సీ రాము మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి రూ.2.50 లక్షలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పీఎం సూర్య ఘర్‌తో పాటు కేంద్రం అమలు చేసే ఇతర పథకాలు అందుతాయదన్నారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, ఈఈలు సూరిబాబు, డి.నరసింహమూర్తి, డీఈఈ రాజేష్, ఏఈ సుధాకర్, స్థానిక నాయకులు నాయుడు, ఆశీర్వాదం, రవి పాల్గొన్నారు.